విద్యార్థికి వైద్యం కోసం సాయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విద్యార్థికి వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం ఆర్థిక సాయం అందించారు. తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు, ఇటువంటి వారికి సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తున్నామన్నారు. మాలే విజయలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆవహించిన బెట్టింగ్ భూతం

- టి 20 వరల్డ్ కప్‌కు రోజూ బెట్టింగ్
- చేతులు మారుతున్న రూ.కోట్లు
- డిజిటల్ లావాదేవీలు
- చితికిపోతున్న యువత



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టి20 వరల్డ్ కప్ నేపథ్యంలో జిల్లాలో బెట్టింగ్ జోరుగా సాగుతోంది. క్రికెట్ బెట్టింగ్‌ను బుకీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నడిపిస్తున్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీ ఉపయోగించుకుని బెట్టింగ్ ద్వారా రోజూ రూ.కోట్లు చేతులు మార్చుతున్నారు. నేరుగా క్యాష్ కాకుండా ఈసారి లావాదేవీలన్నీ డిజిటల్ పేమెంట్లలోనే జరుగుతున్నాయి. ప్రస్తుతం టీ20 వరల్డ్ కప్ జరుగుతోంది. రోజూ సుమారు రూ.2 కోట్లకు పైగా జిల్లాలో బెట్టింగ్ జరుగుతున్నట్లు అంచనాగా తెలుస్తోంది. బెట్టింగుల ఫలితంగా కొందరు ఆర్థికంగా చితికిపోయి అప్పులపాలు కావడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. బెట్టింగ్ ఒకప్పుడు ప్రధాన పట్టణాలకే పరిమితం అయ్యేది. అయితే ఇప్పుడు ఆండ్రాయిడ్ ఫోన్ల పుణ్యమా అని పల్లెలకు కూడా పాకింది. ఇంట్లో కూర్చుని టీవీ చూస్తూ బెట్టింగ్ ఆడే సదుపాయాలు ఉండడంతో అందరూ దీనికి బానిసలవుతున్నారు. ఒకప్పుడు చదువుకునే వ్యక్తులు, నిరుద్యోగులు, విద్యార్థులు ఈ మహమ్మారి బారిన పడేవారు. అయితే ఇప్పుడు రోజువారీ కూలీలు మొదలుకుని కొందరు మహిళలు కూడా బెట్టింగ్‌కు పాల్పడుతుండడం గమనార్హం.

పట్టణాల నుంచి పల్లెలకు

క్రికెట్ బెట్టింగ్ స్వరూపం ప్రతి ఏటా మారుతోంది. ఒకప్పుడు మహానగరాలకే పరిమితం కాగా తర్వాత కాలంలో పట్టణాలకు తాజాగా పల్లెలకు విస్తరించింది. యువతే లక్ష్యంగా బుకీలు చక్రం తిప్పుతున్నారు. గతంలో బెట్టింగ్ ఆడాలంటే బుకీల ద్వారా తతంగం నడిచేది. బుకీతోనే సంప్రదింపులు జరిపి బెట్టింగ్ కాసేవారు. అయితే పోలీసుల నిఘా ఎక్కువగా ఉండడంతో బెట్టింగ్ మాఫియా రూటు మార్చింది. యాప్‌ల ద్వారా బెట్టింగ్ కొనసాగిస్తోంది. క్రికెట్ ఆడే రోజుల్లో నిర్వాహకులు, బుకీలు కొన్ని యాప్‌లను సృష్టించి వాటి ద్వారా తాపీగా ఆడుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గూగుల్‌లోకి వెళ్లి బుకీలు పంపిన లింకులను క్లిక్ చేస్తే ఎవరి వివరాలు వారు పొందుపరిస్తే బెట్టింగ్ ఆడుకోవచ్చు. అయితే ఆటలో పాల్గొనేందుకు ముందుగా టోకెన్ అడ్వాన్స్ వసూలు జరుగుతుంది.

స్మార్ట్ ఫోన్లలో తేలికగా బెట్టింగులు

స్మార్ట్ ఫోన్‌లో బెట్టింగ్ యాప్‌లు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. అయితే ఇవన్నీ ప్లేస్టోరులో ఉండకపోవడం గమనార్హం. కేవలం గూగుల్‌లోనే లభ్యమవుతాయి. వీటిలో కొన్ని బెట్టింగ్ యాప్‌లను పరిశీలిస్తే.. స్కై ఎక్స్చేంజ్, ఎబి 247, లార్డ్స్ ఎక్స్చేంజ్, లోటాస్ బుక్ 247.. తదితర యాప్‌లు ఉన్నాయి. యాప్‌లో బెట్టింగ్ ఆడాలంటే తొలుత ఆ లింకును క్లిక్ చేస్తే మన వివరాలు పొందుపరుస్తూ లాగిన్ అవ్వాలి. యాప్ నిర్వాహకులు మనకు యూజర్, పాస్‌వర్డ్ పంపుతారు. మనం పాస్‌వర్డ్ చేంజ్ చేసుకోవచ్చు. వెంటనే మనం బెట్టింగ్ ఆడేందుకు మనం డబ్బులు డిపాజిట్ చేసేందుకు గాను డిజిటల్ పేమెంట్ కోసం కొన్ని అకౌంటు నెంబర్లు ఇస్తారు. డిజిటల్ పేమెంట్స్ యాప్ ద్వారా డిపాజిట్ చేయాల్సి ఉంది. మ్యాచ్‌లో గెలిచిన తరువాత మనం డబ్బు విత్‌డ్రా కోసం మన బ్యాంకు వివరాలను అందించాలి. ఇవన్నీ లాగిన్ కావడం పూర్తయితే యాప్‌లో మ్యాచ్ బెట్టింగ్ ఉంటుంది. ఏ జట్టుపై ఎంత బెట్టింగ్, ఏ బాల్‌కు ఎంత... క్రికెట్ పరిబాషలో ఈటింగ్, బెట్టింగ్ అనే పరిబాషల ద్వారా ఈ బెట్టింగ్ తతంగం సాగుతున్నట్లు తెలుస్తోంది.

సరదాగా మొదలై వ్యసనం వరకు

యాప్‌ల ద్వారా బెట్టింగ్ చాలా ఈజీగా ఉండడంతో సరదా కోసం కొంతమంది యువకులు బెట్టింగ్ కాస్తున్నారు. సిగరెట్, మద్యం మొదలెట్టి దానికి ఎలా బానిసలవుతున్నారో అలాగే బెట్టింగ్ మొదలుపెట్టి దానికి బలైపోతున్నారు. డబ్బు ఒకసారి గెలుచుకుంటే గంటల వ్యవధిలోనే లక్షాధికారులు కావాలన్న ఆశతో స్థోమత కంటే అప్పులు చేసి బెట్టింగ్ కాస్తున్నారు. ఓడిపోతే గంటల వ్యవధిలోనే వీరి పరిస్థితి తల్లకిందులవుతుంది. కాగా, జిల్లాలో రమారమి రోజుకు రూ.2 కోట్లపైగానే బెట్టింగ్ జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. పోలీసు అధికారులు ఆన్‌లైన్ బెట్టింగ్‌పై నిఘా పెట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మద్దతు ధర అందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-అనపర్తి

ఖరీఫ్ పంటకు సంబంధించి రైతులు పండించిన ధాన్యానికి పూర్తి మద్దతు ధరను ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పారదర్శకంగా అందజేస్తామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. బుధవారం మండలంలోని మహేంద్రవాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, కొప్పవరం, అనపర్తి కళ్లాల్లోని ధాన్యాన్ని స్థానిక ఎంఎల్‌ఎ సత్తి సూర్యనారాయణ రెడ్డి, జెసి సిహెచ్.శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో రైతులు పండించిన ధాన్యానికి దళారీ వ్యవస్థ లేకుండా పూర్తి స్థాయిలో మద్దతు ధరను అందించి ఆదుకుంటామన్నారు. జిల్లాలో 239 ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా 133 రైస్ మిల్లులకు ఆయా పిపిసిల ద్వారా ధాన్యం పంపిస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో దళారుల ప్రమేయం లేకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ విధానం వల్ల రైతు ధాన్యం ఏ మిల్లుకు వెళుతుందో తెలియదు. అందువల్ల ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందుకోవడంలో దళారుల చేతిలో రైతు మోసపోడన్నారు. రైతు కళ్ళాల నుంచి ధాన్యం వే్‌బ్రిడ్జికి వెళుతుందని అక్కడ నుంచి కేటాయించిన రైస్ మిల్లుకు ధాన్యం చేరుతుందన్నారు. ఈ విధానం వల్ల రైతు నష్టపోయేందుకు ఎటువంటి అవకాశం లేదన్నారు. ప్రతి ఆర్‌బికె కేంద్రంలో గన్ని బ్యాగులు, సాంకేతిక మిషనరీ, అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. రైతు ధాన్యానికి సంబంధించి ముందుగానే వారి పరిధిలోని ఆర్‌బికె కేంద్రంలోని పిపిసి సెంటర్‌లో షెడ్యూల్ ప్రకారం రసీదు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రైతుకు అవసరమైన గన్నీ బ్యాగులు మిల్లర్ల వద్ద సిద్ధంగా ఉన్నాయన్నారు. రవాణా, హమాలీ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తోందన్నారు. సొంత ట్రాక్టర్‌తో ధాన్యం తోలిన రైతులకు రవాణా ఛార్జీ ఆ రైతుకే చెల్లిస్తామన్నారు. బ్యాంకు గ్యారంటీపై మిల్లర్లకు అవగాహన కల్పించామన్నారు. చెల్లింపుల విషయంలో కూడా మిల్లర్లతో ఉన్నత స్థాయి అధికారులు చర్చించి సానుకూల దక్పథం కల్పించినట్లు చెప్పారు. అనంతరం కొప్పవరంలో కలెక్టర్ మాధవీ లత అధికారులతో కలిసి రైతు పండించిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, రెడ్డి సత్తి రామకృష్ణారెడ్డి, సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి, సబ్బెళ్ళ వెంకటరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, తాడి సత్యనారాయణ రెడ్డి, మల్లిడి ఉమారెడ్డి, మల్లిడి శ్రీనివాస్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, పడాల సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంఎల్‌ఎ

సకాలంలో ధాన్యం సొమ్ము చెల్లింపు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతులు ఒక్క బస్తా కూడా నష్టపోకుండా ధాన్యం మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ సలహా మండల చైర్మన్ బురుగుపల్లి సుబ్బారావు తెలిపారు. బుధవారం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దార్ జి.కనకరాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కోసం ప్రవేశపెట్టిన నూతన విధానంలో రైతులు తమ ధాన్యం కళ్లాల వద్ద నుండి నేరుగా ధాన్యం మిల్లులకు తరలించేలా వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేశారన్నారు. తహశీల్దారు జి.కనకరాజు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, నేరుగా ప్రభుత్వానికే తమ ధాన్యం అమ్ముకుని, నష్టపోకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సేకరించిన ధాన్యానికి 21 రోజుల్లో నేరుగా రైతు బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేలా చేస్తుందన్నారు. కళ్లాల వద్దకు వ్యవసాయ అధికారులు, వాలంటీర్లు వచ్చి తేమ శాతం నమోదు చేయనున్నట్లు వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు తెలిపారు. ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు

ధాన్యం కొనుగోలుకు ఆర్‌బికెలు సిద్ధం

ప్రజాశక్తి - సీతానగరం

బుధవారం నుంచి ధాన్యం కొనుగోలుకు రైతు భరోసా కేంద్రాలు సిద్ధం చేశామని తహశీల్దారు సత్యనారాయణ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యానికి 17 శాతం తేమతో ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. రైతుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందించేందుకు రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. బొబ్బిల్లంక 1, ములకల్లంక (బొబ్బిల్లంక 2), చినకొండేపూడి 1, చినకొండేపూడి 2, ఉండేశ్వరపురం, మిర్తిపాడు, ఇనుగంటి వారిపేట, కాటవరం, కూనవరం, ముగ్గళ్ళ, మునికూడలి, నాగంపల్లి, సింగవరం, పురుషోత్తపట్నం, రఘుదేవపురం 1, రఘుదేవపురం 2, వంగలపూడి రైతు భరోసా కేంద్రాలను రైతులు సంప్రదించి, ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మాలని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-రాజానగరం

ఉపాధ్యాయులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా అన్నారు. వీరికచెప్పారు. రాజా కాంద్రేగుల జగన్నాధ రావు అన్నదాన సత్రంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గొలుగూరు వెంకటరెడ్డి, రమణరావు, గంగయ్యదొరలను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్‌ఎ రాజా మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులు అభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాసంశెట్టి పెద్ద, ఎం.వీర్రాజు, గంగిశెట్టి సోమేశ్వరరావు, డి.పెద్ద, వి.కృష్ణ పాల్గొన్నారు.

వెంకటరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ

20న కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

పట్టణ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న గొర్రెల సూర్య అప్పారావు తోటలో వన సమారాధనను నిర్వహించాలని నిర్ణయించారు. 20 వేల మందితో నిర్వహించే ఈ వన సమారాధనలో ఏర్పాట్లపై బుధవారం చర్చించారు. మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, కిలపర్తి శ్రీనివాస్, సప్పా వెంకట రమణ, అల్లు బాబీ, వాసిరెడ్డి కృష్ణ, వై.సత్యనారాయణ, కొల్లి గోవింద్, కొల్లి బుజ్జి, అల్లు దుర్గా ప్రసాద్, గొర్రెల రమణి, నూకల శ్రీనివాస్, బొడ్డు బంగార్రాజు, నాళం పైడి రాజు, బొడ్డు శ్రీనివాస్, సప్పా ఉమా, కిలపర్తి నాగభూషణం, కొల్లివెలసి హారిక, కర్రి రమణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు శాఖా గ్రంథాలయం, చంద్రవరం శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నారు. చాగల్లు గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రారంభ వేడుకలకు హోమ్ మినిస్టర్ డాక్టర్ తానేటి వనిత ప్రారంభిస్తారని చెప్పారు. వారం రోజులు వివిధ కార్యక్రమాలు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని చాగల్లు గ్రంథాలయ అధికారి గద్దె శ్రీనివాసరావు, చంద్రవరం గ్రంథాలయాధికారి కె.సుమన్ తెలిపారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు సరికావు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని వైసిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ ఆరిఫ్ హితవు పలికారు. జాంపేటలోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఒక నాయకునిగా ఎదగాలంటే యువత ఉద్యోగాలు సంపాదించుకునేలా, తమ కాళ్లపై తాము నిలబడేలా వారిలో స్ఫూర్తిని నింపాలి గాని, పోలీసులపై తిరగబడండి, కేసులు పెట్టించుకోండి, రక్తం చిందించండి అనే వ్యాఖ్యలు దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. విద్యా ఉద్యోగ రంగాల్లో లెక్కలేనని అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తుంటే మీరు మాత్రం మీ రాజకీయ లబ్ధికోసం యువకులను తప్పుదారి పట్టించడం సరికాదన్నారు. ఒచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

ఘనంగా చందన నాగేశ్వర్ పుట్టినరోజు

ప్రజాశక్తి-రాజమండ్రి రూరల్, కడియం

వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ జన్మదిన వేడుకలను బివిఆర్ కన్వెన్షన్ హాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా ముఖ్య అతిథిగా హాజరై అభిమానుల సమక్షంలో చందన నాగేశ్వర్ చేత కేకు కట్ చేయించారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుంచం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి చందన నాగేశ్వర్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. అనంతరం చందన చేయూత ట్రస్ట్ తరపున ఐదుగురు చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందించారు. అభిమానులు నూలు దారాలతో చందన ముఖచిత్రం తీర్చిదిద్ది పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవ సంఘం కేక్ కట్ చేయించి చందన నాగేశ్వర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ రౌతు సూర్యప్రకాశరావు, రుడా చైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శిలి గిరజాల బాబు, రావిపాటి రామచంద్రరావు, మిందే నాగేంద్ర, నందెపు శ్రీనివాస్, జక్కంపూడి గణేష్ పాల్గొన్నారు. చందన నాగేశ్వర్ పుట్టినరోజు వేడుకలు మండలంలోని వేమగిరి, కడియపులంక, బుర్రిలంక గ్రామాల్లో స్థానిక నేతలు ఘనంగా నిర్వహించారు. బుర్రిలంకలో ఈశ్వర ఫామ్ నర్సరీ అధినేత తాడాల చక్రవర్తి, గాధ రామకృష్ణ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో నాగేశ్వర్ పాల్గొన్నారు.

కడియంలో వేడుకల్లో పాల్గొ నాగేశ్వర్

డిజిటల్ అసిస్టెంట్స్ సర్వీస్ రిక్వెస్టు పెంచాలి

ప్రజాశక్తి- గోకవరం

గ్రామ సచివాలయంలో పని చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల సర్వీసు రిక్వెస్ట్ పెంచాలని గోకవరం ఎంపిడిఒ కెవిఎస్ఎస్-ఎస్.మూర్తి అన్నారు. బుధవారం గోకవరం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బందితో ఎంపిడిఒ కెవిఎస్ఎస్.మూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులు చెరువుల లైసెన్స్ ఇతర ఫీజులు డిమాండ్ ఏరియాస్ సొమ్ములు గ్రామపంచాయతీ కార్యదర్శి నూటికి నూరు శాతం వసూలు చేయాలని తెలిపారు. తరువాత సమావేశానికి 100 శాతం వసూలు చేసి వసూలు చేసిన సొమ్ములు బ్యాంకు ఖాతాకు జమ చేసి వాటి చలానా నెంబర్లు జిరాక్స్ కాపీలు ఇఒపిఆర్‌డి రాజేశ్వరరావుకు అందజేయాలని తెలిపారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సచివాలయం సిబ్బంది గ్రామ వాలంటీర్లు నూరు శాతం వెయ్యాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో పని చేస్తున్న వాలంటీర్లు వ్యవసాయ సహాయకులు గ్రామపంచాయతీ కార్యదర్శి ఆదేశాలతో పనులు పూర్తి చేయాలని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్య సేవలు

ప్రజాశక్తి-గోపాలపురం

వైద్యాధికారులచే గ్రామీణ నిరుపేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ ఫిజిషియన్ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని వాదాలకుంట సర్పంచ్ జొన్నకూటి మణమ్మ అన్నారు. బుధవారం వాదాలకుంట పంచాయతీ కార్యాలయం వద్ద సిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం.చైతన్య రాజు, 104 వైద్యులు ఎ.డేవిడ్ రాజు ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు, సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వా సుపత్రులకు దూరంగా ఉండే గ్రామాల్లో వైద్య సేవలను చేరువ చేసేందుకు, ప్రభుత్వా సుపత్రిలో పెరుగుతున్న రోగుల భారాన్ని తగ్గించేం దుకు గ్రామాల వద్దకే వెళ్లి వైద్య బందం చేత రక్త పరీక్షలు నిర్వహించి వారికి అవసరమయ్యే ముందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జొన్నకూటి శ్రీనివాసరావు, నాగబాబు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

కార్టూ'నిజం'



అవును.. ప్రజలకు చెప్పకుండా చేసేవే ఎక్కువ కద్సార్ మనం..!!

బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి నేతలు

పెద్దేవంలో బాదుడే బాదుడు..

ప్రజాశక్తి-తాళ్లపూడి

టిడిపి ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప జగనన్న పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కానరావడం లేదని కొవ్వూరు నియోజకవర్గ నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ అన్నారు. టిడిపి నిర్వహిస్తున్న బాదుడే బాదుడు కార్యక్రమాన్ని మండలంలోని పెద్దేవంలో బుధవారం నిర్వహించారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ జగనన్న పాలనలో అభివృద్ధి కానరాకపోవడమే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తిగిరిపల్లి గోపి, బోడపాటి గంగరాజు, కాకర్ల సత్యేంద్ర, బోడపాటి కాశి, కూచిపూడి లక్ష్మీ గణపతి, ముళ్లపూడి రాంబాబు, రాజేష్, శ్రీను, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారి

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం పిహెచ్‌సిలో వైద్యాధికారి ఆర్.ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు 53 మంది గర్భిణులకు డాక్టర్ ఆయేషా ఖాన్, డాక్టర్ ఉషా దేవి పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు అందజేశారు. అవసరమైన వారికి చికిత్స, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎల్, కెడివిఎల్.కుమారి, ఎంపిహెచ్‌ఎస్ కె.సుభాషిణి, కె.నాగమణి, స్టాఫ్ నర్సులు కుమారి, సంధ్య, ఝాన్సీరాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- దేవరపల్లి

దేవరపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గోపాలపురం ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు బుధవారం ప్రారంభించారు. అనంతరం ధాన్యం తేమశాతం పరిశీలించే యంత్రాన్ని పరిశీలించారు. ధాన్యం తేమ 17 శాతం ఉంటే రైతుల వద్ద నుండి వెంటనే ధాన్యం కొనుగోలు చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమామహేశ్వర శర్మ, తహశీల్దారు రామకష్ణ, సొసైటీ చైర్మన్ కవల శ్రీను పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జనవరి ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికీ ముందస్తుగా ఓటు నమోదుకు అవకాశం కల్పిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురణ సందర్భంగా ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. నవంబర్ 9 వ తేదీన నమూనా ఇతర బ్లాగులు జాబితా ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించామన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు తప్పనిసరిగా కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ అబ్రహాం, కె.విజయ కుమారి పాల్గొన్నారు.

2 నుంచి రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

రాష్ట్ర స్థాయి రోల్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 12, 13వ తేదీల్లో సంపత్ నగరం రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో నిర్వహించనున్నట్లు రాజమహేంద్రి విద్యాసంస్థల ఛైర్మన్ టికె.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వెల్లడించారు. 12న కలెక్టర్ కె.మాధవీలత పోటీలను ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డిఇఒ ఎస్.అబ్రహాం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ డిఎంఎం శేషగిరి, ఆంధ్రా రోల్ బాల్ అసోసియేషన్ ఫౌండర్ మెంబర్ శివలింగం ప్రసాద్, అసోసియేషన్ ప్రెసిడెంట్ బివిఎస్ కిరణ్ కిషోర్ హాజరువుతారని తెలిపారు. 13న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ భరత్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, రాజానగరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా బహుమతి ప్రదానోత్సవం చేస్తారన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రి విద్యాసంస్థల ప్రతినిధి ఎల్‌వి రామిరెడ్డి ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న విశ్వేశ్వరరెడ్డి

జయలక్ష్మి సొసైటీ డైరెక్టర్ల అరెస్టు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జయలక్ష్మి సొసైటీలో డిపాజిటర్ల సొమ్ములు దుర్వినియోగం కేసులో ఇద్దరు డైరెక్టర్లను అరెస్టు చేసినట్లు సిఐడి అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు అధికారి ఇన్స్పెక్టర్ తేజోవతికి అందిన సమాచారం మేరకు మంగళవారం సంతాన దీక్ష భాస్కరరావు, అచ్యుతరామయ్యను స్థానిక గౌతమీ ఘాట్ వద్ద అరెస్టు చేశారు. కాకినాడ కేంద్రంగా పని చేస్తున్న జయలక్ష్మి మ్యూచువల్ సొసైటీలో డిపాజిటర్ల సొమ్ములు దుర్వినియోగం చేసినందుకు పలు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కేసును దర్యాప్తు కోసం కేసును సిఐడికి బదలాయించారు. ఇప్పటికే ఈ కేసులో జయలక్ష్మి సొసైటీ వ్యవస్థాపకులు రాయవరపు సీతారామాంజనేయులు, రాయవరపు బుద్ధి విజయలక్ష్మి, రాయవరపు జయదేవ్ అరెస్టయ్యారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వైస్ ఎంపిపి నరహరిశెట్టి సరోజ అన్నారు. బుధవారం ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడ పోస్టర్లు ఆవిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేటి తరం విద్యార్థులు, పుస్తకాల విలువ తెలియజేయాలని, పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు రోజు గ్రంథాలయాలకు వెళ్లేలా ప్రోత్సహించాలన్నారు. విజ్ఞానం పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జోడి సభ్యులు శ్రీనివాసరావు, వైఎస్సిపి నాయకులు దోనేపూడి సుధాకర్, సింహాద్రి రామచంద్రరావు, కరకం వీరభద్రరావు, నారాయణ, గ్రంథాలయ నిర్వాహకులు గుత్తికొండ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దోమ తెగులుతో భారీగా పంట నష్టం

ప్రజాశక్తి - గోకవరం

మండలం పలు గ్రామాల్లో దోమ తెగులు వరి పంటకు భారీగా నష్టం కలిగిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు గోకవరం మండలం వ్యవసాయ శాఖ అధికారిని పి.రాజారాజేశ్వరి ఆధ్వర్యంలో పర్యటించారు. రంపయర్రంపాలెం వెళ్లే రోడ్డు మార్గం పక్కన ఉన్న వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో సుడి దోమ లక్షణాలు గమనించామన్నారు. పిల్ల పురుగు, వరి దుబ్బు మొదలు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల దుబ్బులు ఎండి పోతున్నాయని, గింజ పాలు పోసుకునే దశలో దోమ ఆశిస్తే నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. 200 లీటర్ల నీటిలో అధికారులు సూచించిన పురుగు మందులు కలిపి పిచికారీ చేసే నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి మల్లికార్జున రావు, ఎడిఎ బోసు బాబు వాలంటీర్లు రైతులు పాల్గొన్నారు.

ముక్కామలలో 'పొలం బడి'

ప్రజాశక్తి-పెరవలి

ముక్కామలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ మహేష్ మాట్లాడుతూ పంటలను ఆశించే తెగుళ్ల పురుగుల నివారణకు ప్రకృతి వ్యవసాయ విధానాల్లో భాగంగా చేయాల్సిన నివారణ చర్యల గురించి అవగాహన కల్పించవచ్చని అన్నారు. 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బికె సిబ్బంది పిఆర్పి బుజ్జి రైతులు పాల్గొన్నారు.

మినుము పంట కోత ప్రయోగం

ప్రజాశక్తి-తాళ్లపూడి

అన్నదేవరపేటలో రైతు లింగంపల్లి వీరబాబుకు చెందిన పంట పొలంలో బుధవారం మినుము పంట కోత ప్రయోగం నిర్వహించినట్లు మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పంట కోత ప్రయోగంలో మినుము ఎకరాకి నాలుగు బస్తాల దిగుబడి వచ్చినట్టు గుర్తించామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మినుము ధర రూ.7 వేల ఆశాజనకంగా ఉన్నప్పటికీ దిగుబడి తగ్గడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్.సతీష్, ఎల్.సుధీర్ బాబు, హెచ్‌డిఎఫ్ ప్రతినిధి పోసి బాబు, రైతులు వీరబాబు, శ్రీనివాస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

15 నుంచి యువజనోత్సవాలు

ప్రజాశక్తి -అమలాపురం

అంబేద్కర్ భవన్ నందు ఈ నెల 15న జిల్లా స్థాయిలో నిర్వహించే యువజనోత్సాల్లో యువత పాల్గొనాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో యువ జనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 15-29 సంవత్సరముల మధ్య వయస్సు గల యువతీ, యువ కులకు వివిధ సాంస్కృతిక అంశాలలో జిల్లా స్థాయిలో పోటీలను జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్రాజ్ వారి ఆధ్వర్యములో నిర్వహిస్తారన్నారు.

నూతన విద్యావిధానంతో ప్రతికూల ప్రభావం

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

ప్రభుత్వం నూతన విద్యా విధానం 2020 పేరుతో విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులు ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉందని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్ అన్నారు. బుధవారం భీమనపల్లిలో మండల శాఖ అధ్యక్షులు చిక్కం మైనర్ బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జివివి. సత్యనారాయణ, సభాధ్యక్షులు చిక్కం మైనర్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస్, జిల్లా మహిళా కన్వీనర్ వి.రత్నకుమా తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -అమలాపురం /అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల నందు బుధవారం మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు, ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటు నమోదు చేసుకోవాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవిఆర్ఎన్. నరసింహరావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, ఎఒ కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం పరామర్శించారు నేలటూరు గ్రామంలో సోమేశ్వరరావు కుటుంబ సభ్యులను, బొప్పె సూర్యారావు కుటుంబ సభ్యులను, యార్లగడ ఏసేబు కుటుంబ సభ్యులను, నల్లూరు గ్రామంలో గుడెల సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ, పలువురు నాయకులు పరామర్శించారు.

ఎస్.అగ్రహారంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎస్.అగ్రహారంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్వచంద్రప్రసాద్ బుధవారం కాకినాడ ఎంపీ వంగా గీతతో కలిసి గ్రామంలో ఇంటింటా పర్యటించారు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, ఎంపిడిఒ గోవిందు, సర్పంచ్ ఎస్.శ్రీను, వైసిపి మండల అధ్యక్షులు శ్రీను సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులకు అధునాతన పరికరాలు

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

పూడిక తీత పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఒఎన్‌జిసి సంస్థ అధునాతన పరికరాన్ని కార్పొరేషన్‌కు సమకూర్చింది. రూ 40 లక్షల సిఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన రోబోటిక్ స్కావెంజింగ్ మిషన్‌ను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదేశ్ కుమార్ బుధవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఒఎన్‌జిసి ఇడి ఆదేశ్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ సేవా కార్యక్రమాలలో భాగంగా దేశవ్యాప్తంగా 12 రోబోటిక్ స్కావెంజింగ్ మిషన్లు సమకూర్చామన్నారు. ఇటీవల విశాఖ నగరపాలక సంస్థకు కూడా అందజేశామన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కే.రమేష్ మాట్లాడుతూ మ్యాన్ హోల్స్, అండర్ గ్రౌండ్ డ్రైన్ లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఒఎన్‌జిసికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒఎన్‌జిసి హెచ్ఆర్ మేనేజర్ డి.మల్లిక్, డిఇ మాధవి, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. సందర్భంగా ఎంఎల్ఎ చంటిబాబు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం ద్వారా రైతాంగానికి దళారీ వ్యవస్థను నిర్మూలించే విధంగా రైతులకు అన్ని రకాలుగా ధాన్యం కొనుగోలే కాక రైతులకు వ్యవసాయ పనిముట్లు వ్యవసాయ యంత్రాలు, రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకునే విధంగా చర్యలు తీసుకునే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో రైతులకు టెక్నికల్ ఇబ్బందులు లేకుండా రైతాంగానికి అన్ని విధాలా ఉపయోగపడే విధంగా రైతు భరోసా కేంద్రాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం ధాన్యం పరిశీలన యంత్రాలను ఎంఎల్ఎ చంటిబాబు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, ఎడి మల్లికార్జునరావు, ఎడిఎ బోసు బాబు, ఎఒ పి.రాజరాజేశ్వరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జడ్‌పి సమావేశం15వ తేదీకి వాయిదా

ప్రజాశక్తి - కాకినాడ

ఈ నెల 11న జరగాల్సిన జడ్‌పి సర్వ సభ్య సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశామని జడ్‌పి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్‌వివి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు జడ్‌పి కార్యాలయంలోని జిఎంసి బాలయోగి సమావేశ మందిరంలో జడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపారావు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశ తేదీ మార్పు అంశాన్ని సభ్యులు, అధికారులు గుర్తించాలని సిఇఒ కోరారు.

సామాజిక స్థలం ఆక్రమణపై నిరసన

ప్రజాశక్తి - కాకినాడ

కాజులూరు మండలం రాసబంద గ్రామంలో సామాజిక స్థలం ఆక్రమణపై గ్రామస్తులు బుధవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1986లో మాదిగల కోసం 16 ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వాటిల్లో రెండు స్థలాలను అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించారన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ మేరకు స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరాఉ. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందించారు.

కొడవలిలో గడప గడపకూ..

ప్రజాశక్తి - పిఠాపురం

గొల్లప్రోలు మండలం కొడవలిలో బుధవారం గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం పోలీసు బందోబస్తు మధ్య సాగింది. ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో ఈ కార్యక్రమానికి పోలీసులు బందోబస్తు చేపట్టారు. పిఠాపురం సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సమక్షంలో ముగ్గురు ఎస్ఐలు, 30 మంది పోలీసులు ఈ బందోబస్తులో పాల్గొన్నారు. పిఠాపురం ఎంఎల్ఎ పెండెం దొరబాబు ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీలపై పలువురు ఫిర్యాదు చేశారు. వాలంటీర్లు సరిగా పనిచేయట్లేదని ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులు, వాలంటీర్లపై ఉందన్నారు. కొడవలిలో రూ.25 కోట్లతో పలు పనుల చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అరిగెల అచ్చియమ్మ, సర్పంచ్ బుర్ర సూర్యచంద్ర, ఎంపిటిసి సభ్యులు భగవాన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ ఏజెన్సీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -రౌతులపూడి

సబ్ ప్లాన్ ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని ఎంపీ వంగా గీత, ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్ అన్నారు. రాఘవపట్నం పంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.30 లక్షలతో నిర్మించిన ఆర్‌బికె కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాఘవపట్నంలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని, రౌతులపూడి నుంచి రాఘవపట్నం వరకు ఆర్‌టిసి సర్వీసులు ప్రారంభించాలని పలువురు వినతిపత్రం అందించారు. అనంతరం ఎస్.పైడిపాల, ఎస్.అగ్రహారాల్లో నిర్మించిన సచివాలయాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, వైస్ ఎంపిపి సూరిరెడ్డి తిరుమలరాయలు, ఎంపిడిఒ ఎం.గోవిందు, తహశీల్దార్ శివకుమార్, సర్పంచులు ఎస్.శ్రీనివాస్, జి.వరలక్ష్మి, వైసిపి మండల అధ్యక్షులు జి.శ్రీను, జడ్‌పిటిసి మాజీ సభ్యులు సిహెచ్.సత్తిబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో నిత్యాన్నదానం

గండేపల్లి : ఉప్పలపాడులో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్య అన్నదానాన్ని బుధవారం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, జెఎస్‌పి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర, ఎన్ఆర్ఐలు పైడా శ్రీరామ్, పైడా వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, సిహెచ్.దొరబాబు, కె.రాజా, ఎ.ఆంజనేయులు, తోట రవి, ఒమ్మి రఘురాం, ఎస్‌విఎన్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తం

గండేపల్లి : ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సౌమ్య గర్భిణులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. 50 మంది గర్భిణులకు స్త్రీలకు వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ సౌమ్య తెలిపారు. గండేపల్లికి చెందిన ఇమ్మంది శ్రీనివాస్ గర్భిణులకు పండ్లు పంపిణీ చేవారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

హైస్కూల్ గోడ వివాదం పరిష్కారం

ప్రజాశక్తి- తాళ్లరేవు

నామన వెంకాయమ్మ జెడ్‌పి హై స్కూల్ గోడ వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. గోడను కూల్చేసిన ఘటనపై ఎంపిపి రాయుడు సునీత, ప్రజాప్రతినిధులు హైస్కూలు ఉపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పనులకు సంబంధించి మెటీరియల్ రావడానికి గోడను తొలగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. దీనిపై హెచ్ఎం జె.ఆశాలత ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఎంఎల్ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు రాయుడు సునీత, జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ సమక్షంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి దూలిపూడి నాగేంద్రప్రసాద్, పిఎంసి చైర్మన్ మట్టపర్తి శ్రీనివాస్, నాయకులు రాయుడు గంగాధర్, కోపనాతి నాగరాజు, రెడ్డి రెడ్డి బాబు, ఆకుల వెంకన్న, నంది కోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి పాల్గొన్నారు.

వ్యర్థ జలాల శుద్ధికి చర్యలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు వ్యర్థ జలాలను శుద్ధిచేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. బుధవారం ఆయన దుమ్ములపేట, శారదాదేవి ఆలయ ప్రాంతాల్లో మురుగునీటిని శుద్ధి చేసే ప్రక్రియను పరిశీలించారు. డ్రెయినేజీల్లో ప్రమాదకర, హానికర వ్యర్థాల తీవ్రతను తగ్గించేందుకు రసాయనాలతో శుద్ధి చేస్తున్నామన్నారు. బయో రెమిడేషన్ ప్రక్రియ ద్వారా కాకినాడలోని రెవెన్యూ కాలనీ, చీడిలపొర దుమ్ములపేట, ప్రాంతాలలో వ్యర్థ జలాల శుద్ధి ప్రక్రియ జరుగుతుందన్నారు.

నోటికి నల్లరిబ్బన్లతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పెద్దాపురం

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ పట్టాభి ఆగ్రో పరిశ్రమ కార్మికులు బుధవారం నోటికి నల్ల రిబ్బన్లను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికులను తొలగించి ఆరు నెలల గడుస్తుందన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల హక్కులను, చట్టాలను పట్టాభి ఆగ్రో పరిశ్రమ యాజమాన్యం కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలు అమలు చేయకపోయినా కార్మిక శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం ఈ సమస్యను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, వడ్డి సత్యనారాయణ, డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో విద్యకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

ముఖ్యమంత్రి జగన్ హయాంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 'నాడు- నేడు'లో బాగంగా రూ.1.55 కోట్లతో నిర్మించిన తరగతి గదుల భవనానికి ప్రారంభోత్సవం, రెండో ఫేజ్‌లో రూ.93 లక్షలతో చేపట్టే ఎనిమిది అదనపు తరగతి గదుల పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను ఆయన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. అలాగే అభివృద్ధి పనులకు కౌన్సిలర్ పాలిక కుసుమ, చంటిబాబు దంపతులు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజేష్, ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

ప్రజాశక్తి -రామచంద్రపురం

తొలకరిలో రైతుల పండించిన ధాన్యం అంతా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆర్‌బికెల్లో ధాన్యాన్ని విక్రయించాలని మంత్రి చెల్లుబోయిన వేణుఅన్నారు. బుధవారం ఎంపిపి అంబటి భవాని అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ధాన్యం కొనుగోలుపై ప్రకటన చేయాలని తహశీల్దార్ తేజేశ్వరరావుకు సూచించారు. మండలంలోని 19 ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని వివరించారు. రెండో పంటను కూడా త్వరగా వేసుకోవాలన్నారు. గ్రామాల్లో చెత్తను తొలగించేదుకు ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలన్నారు. వెల్ల ఎంపిటిసి సభ్యుడు చిక్కల స్వామి మాట్లాడుతూ ఆర్‌బికెల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటనలు ఇస్తున్నా, ఎవరూ ఎందుకు కొనడం లేదని అధికారులను నిలదీశారు. 8 నెలలుగా తోటపేటలో ఉపాధి పనులు నిలిచిపోయినా పట్టించుకోవట్లేదని, ఫీల్డ్ అసిస్టెంట్ నియమించేందుకు సర్పంచ్ పైరవీలు సాగిస్తున్నారని ఎంపిటిసి సభ్యురాలు నాగ సంధ్య అధికారులను నిలదీశారు. ఎంపిపి భవాని మాట్లాడుతూ అంగన్‌వాడీలు, పాఠశాలలకు సరఫరా అయ్యే గుడ్లు నాసిరకంగా ఉంటున్నాయని ఐసిడిఎస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్యాస్ బండ్లపై అదనంగా రూ.60 నుంచి రూ.70 వసూలు చేస్తున్నారన్నారు. దీనిపై రెవెన్యూ శాఖ స్పందించాలని కోరాఆరు. కొనుగోలు కేంద్రాల వద్ద నియమించిన సిబ్బందికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని పలువురు సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లో జరిగే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను పిలవడం లేదని, తమకు కనీస గౌరవం ఇవ్వడం లేదని కాపవరం ఎంపిటిసి సభ్యుడు రెడ్నం సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, విద్యుత్, వ్యవసాయ సమస్యలను పలువురు సభ్యులు ప్రస్తావించారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపిడిఒ కీర్తి స్పందన, తహశీల్దార్ తేజేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి ఎం.రాజు, ఇఒపిఆర్‌డి ఎన్.సాలట్‌రాజు, ఎంఇఒ ఎం. శ్రీనివాస్. ఎఇ ఎన్.సత్యప్రసాద్ ఆర్అండ్‌బి జెఇ టివిఎస్.సూర్యనారాయణ, సిడిపిఒ వరాహ లక్ష్మి, తదితరులు హాజరయ్యారు. తొలుత ఓదూరు సర్పంచ్ బుంగ మేరి మృతికి సభలో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, పాల్గొన్న ఎంపిపి తదితరులు

దీక్షా శిబిరంలో పాల్గొన్న సంఘాల నాయకులు

దంగేటి రాంబాబు అరెస్టుకు డిమాండ్

ప్రజాశక్తి అమలాపురం

చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి, ఎస్‌టి మహిళా ఉద్యోగిని రొడ్డ భవాని మృతికి కారకులైన దంగేటి రాంబాబు ను అరెస్టు చేసి శిక్షించాలని భవాని న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది.కలెక్టరేట్ వద్ద భవాని న్యాయ పోరాట సమితి ఆధ్వర్యం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 69వ రోజుకి చేరుకున్నాయి. దీక్షలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు ప్రజా చైతన్యం టీం పరమట భీమా మహేష్ ,పొల మూరి సురేష్ , విసికె పార్టీ జిల్లా అధ్యక్షులు బొంతు రమణ , భీమ్ సైనిక్ మెరమెల్ల శివ, డేవిడ్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి నిమోనియాపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్రేయపురం

నిమోనియా వ్యాధి పై 12 వ తేదీ నుండి ఇంటింటికి వెళ్లి ఈ వ్యాధి అవగాహన కల్పిస్తామనిలని ర్యాలీ పిహెచ్‌సి వైద్యాధికారి సునీత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎఎన్ఎం, ఆశ వర్కర్లలో పిహెచ్‌సి సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు నిమోనియా వ్యాధి ఐదేళ్ల లోపు వ్యాపిస్తుందన్నారు. ఇది ప్రాణాంతకమైన వ్యాధని, వ్యాధి లక్షణాలు దగ్గు, జలుబు ఎక్కువగా ఉండటం, ఎక్కువ సార్లు వేగముగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకుని. సమయంలో డొక్కలు ఎగురవేయడమని అన్నారు. నిమోనియా వ్యాధి పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు

మద్దతు ధర లభించేలా చర్యలు

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

రైతులకు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రామచంద్రపురం ఆర్‌డిఒ సింధు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు, గ్రామ రెవెన్యూ అధికారులకు, సొసైటీ సీఈఓలకు ,డిజిటల్ అసిస్టెంట్లకు, ఆర్ బి కె వాలంటీర్లకు ,ధాన్యం కొనుగోలు, నాణ్యత ప్రమాణాలు, నియమ నిబంధనలు, తదితర అంశాలపై ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో తహశీల్దార్ పి. చిన్నారావు, మండల వ్యవసాయ అధికారి రమేష్ కుమార్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రకాష్ , ఆర్ ఐ సంధ్య తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు** రైతులు తమ పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా మాత్రమే విక్రయించుకోవాలని తహశీల్దార్ జి.లక్ష్మీపతి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో రైస్ మిల్లులో విక్రయించుకోవచ్చని రెండు రోజులలో ఆన్లైన్ చేయబడతాయని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. ఇలా అసత్య ప్రసారాలు చేసే వారిపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సొసైటీలకు మినహాయింపు ఇవ్వాలి

మండపేటధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సొసైటీలకు మినహాయింపు ఇవ్వాలని ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ కోశాధికారి టి. వెంకటమయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలును ఆర్‌బికెలకు అప్పగించి సహకార సంఘాలను సపోర్టింగ్ ఏజెన్సీలుగా పనిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. గత రబీ సీజన్ వరకు మా సహకారాన్ని వారికి అందించి ఆర్‌బికె చెప్పిన పనులను చేశామన్నారు. ప్రస్తుతం సొసైటీలు పూర్తి బాధ్యతలు అప్పగించి ఆర్‌బికెల ప్రమేయం తగ్గించడం ద్వారాక్షేత్రస్థాయిలో సహకార సంఘాలు ఇబ్బందులకు గురికాక తప్పదన్నారు. సివిల్ సప్లై ఆధ్వర్యంలో నియమించిన టిఎలు సొసైటీ సీఈఓల సూచనలు పాటించడం లేదన్నారు.

ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

అమలాపురం ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జి.మల్లికార్జున్ రావు బుధవారం ఇంచార్జ్ డిఎల్‌పిఒగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం డిఎల్‌పిఒ ఆర్.విక్టర్ మూడు సంవత్సరాలు పనిచేసి కాకినాడ డిపిఒగా పదోన్నతి మీద వెళ్లడంతో మల్లికార్జున్ రావు ఈ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని గ్రామ కార్యదర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శుల జిల్లా అధ్యక్షులు సూరపరాజు, మండల అధ్యక్షులు రెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. No. 37/2018

Between:

పిటిషనరు: మెట్ల రవికుమార్

రెస్పాండెంట్లు: మారుతి ఫైనాన్స్, రావులపాలెం మేనేజింగ్ పార్టనర్, వెంకటేశ్వరరావు, వగైరాలు

To:

11వ రెస్పాండెంటు: శివసాయి ఫైనాన్స్, రావులపాలెం, మేనేజింగ్ పార్టనర్, శ్రీనివాసరెడ్డి

ఈ నెంబరు పిటిషను యందు 11వ రెస్పాండెంటుకు ఎన్నిసార్లు నోటీసులు కోర్టు మరియు పోస్టు ద్వారా పంపినప్పటికీ సదరు 11వ రెస్పాండెంటుకు అమలు కానందున ఇందుమూలముగా నోటీసు నిమిత్తం **ది. 29-11-2022వ తేదిని ఉదయం 10.30 గంటలకు** వాయిదా అయి ఉన్నందున సదరు తేదీని స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి ఆక్షేపణలున్న ఎడల తెలియపర్చుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

మాకిరెడ్డి ఆదినారాయణరావు
పిటిషనర్ తరపు అద్వకేటు, అమలాపురం
సెల్:9848059496

వేలం ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, పిఠాపురం వారి కోర్టులో

E.P. No. 7/2017 in O.S. No. 150/2012

Between:

యర్రా రాయుడు అనే రాంబాబు -డిక్రీ హోల్డరు/ వాది

మరియు

జీలకర్ర సత్తిబాబు అనే పెద సత్తిబాబు -జడ్జిమెంటు డెటార్/ ప్రతివాది

పై నెంబరు అమలు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం జడ్జిమెంటు డెటారు/ప్రతివాది స్వాధీన హక్కుభుక్తములో గల యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని యిస్తిహారు షరతులు ప్రకారం పై కోర్టు వారి ఎదుట **ది. 11-11-2022వ తేదీ శుక్రవారం ఉదయం గం॥ 10-00ల** నుండి బహిరంగ వేలము వేయుదురు. కావున సదరు ఆస్తిని పాడుకొనదలచినవారు పై కోర్టు వారు ఎదుట బహిరంగ వేలంలో పాల్గొని పాడుకోవచ్చునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: తూర్పుగోదావరి జిల్లా, సామర్లకోట సబ్-డివిజను, సామర్లకోట సబు రిజిష్ట్రీ, పిఠాపురం మండలం, విరవాడ గ్రామము, విరవాడ పంచాయితీలో చేరియున్న డోరు నెం. 8-123 (కొత్త డోర్ నెం. 8-140/ఎ) అయిన య. 0-04 సెంట్లు గల జడ్జిమెంటు డెటార్/ ప్రతివాది చెందిన ఆర్.సి.సి. బిల్డింగు మరియు నివేశన స్థలంనకు హద్దులు.

తూర్పు: పంచాయితీ ఆఫీస్.
పడమర: ఉమర్ ఆలీషా ప్రార్థనా మందిరం.
ఉత్తరం: పంచాయితీ రోడ్డు.
దక్షిణం: జీలకర్ర నారాయణరావు గారి ఇల్లు.

సదరు పై హద్దుల మధ్యస్థమైన ఆర్.సి.సి. బిల్డింగు, తలుపులు, ద్వారబంధములు, కిటికీలు, కరెంటు మరియు ఎలక్ట్రికల్ ఫిట్టింగులు వగైరా యావత్తు యాజిమెంటు హక్కులతో సహా.

డిక్రీ హోల్డరు విలువ: రూ. 2,50,000/-
అమీనా విలువ: రూ. 9,00,000/-
మార్కెట్ విలువ: రూ. 7,50,000/-
జడ్జిమెంటు డెటారు విలువ: లేదు

(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వేలము తేదీ: 11-11-2022

కందా వెంకటరమణ, అడ్వకేట్
పిఠాపురం, సెల్: 9346330567

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -ఆత్రేయపురం

బొబ్బర్లంక గ్రామ శివారు పిచ్చికలంక వద్ద గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించారు. దీనిపై పోలీసులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సిహెచ్.సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టమ్‌కు తరలించారు.

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-నల్లజర్ల

అచ్చన్న పాలెంలో కడుపునొప్పి తాళలేక యువకుడు గడ్డి మందు సేవించి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నల్లజర్ల పోలీసులు బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. అచ్చన్న పాలెం ఎస్‌సి కాలనీకి చెందిన పెనుమాక ఆనంద్ నందు (24)ం కడుపునొప్పి తాళలేక, ఈనెల 5న గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం యువకుడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదైంది.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - సీతానగరం

మంగళవారం సింగవరం గ్రామ శివారులో పేకాట శిబిరం పై సీతానగరం ఎస్ఐ శుభ శేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాడుతున్న నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1520 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామని ఎస్ఐ తెలిపారు.

మహారాజశ్రీ 6వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 176/2020

Between:

Padala Sriniavasa Reddy, S/o. P.Parasurama Reddy, Hindu, aged 36 years, Business, resident of D.No. 60-7-23/1, P&T Colony, Rajamahendravaram, RJY JCJC. -వాది

AND

Pericherla Hemalatha, W/o. P.Ramakrishna Raju (late), aged 40 years, House wife, R/o. D.No. 68-10A-17, Navbharat Public School Road, Vidyutnagar, Kakinada, Kakinada Junior Civil Judge Court Jurisdiction. -ప్రతివాది

పై నంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-11-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వసుధ శ్రీనివాస్
రాజమండ్రి అద్వకేట్, కాకినాడ
9-11-2022 సెల్: 9848054030

మహారాజశ్రీ 6వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

I.A. No. 20/2020

O.S. No. 176/2020

Between:

Padala Sriniavasa Reddy, S/o. P.Parasurama Reddy, Hindu, aged 36 years, Business, resident of D.No. 60-7-23/1, P&T Colony, Rajamahendravaram, RJY JCJC. -పిటిషనర్/వాది

AND

Pericherla Hemalatha, W/o. P.Ramakrishna Raju (late), aged 40 years, House wife, R/o. D.No. 68-10A-17, Navbharat Public School Road, Vidyutnagar, Kakinada, Kakinada Junior Civil Judge Court Jurisdiction. -రెస్పాండెంట్/ప్రతివాది

పై నంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు/ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-11-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వసుధ శ్రీనివాస్
రాజమండ్రి అద్వకేట్, కాకినాడ
9-11-2022 సెల్: 9848054030

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జ్యూడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేటు వారి కోర్టు

C.C.No. 247/2017

Between:

Mare Thomas Victor

...Petitioner /Complainant

AND

Karedla Chakra Rao @ Chakri, S/o. Ganga Rao, D.No.6-5/7, Adapa Vari Street, Karakuduru, Pedapudi Mandal, Kakinada District.

...Respondent / Accused

పై నెంబరు గల కేసులో పిటీషనరు అయిన మారే థామస్ విక్టర్, రెస్పాండెంటు అయిన కరెడ్ల చక్రరావు అను మీపై చెక్ బౌన్స్ కేసు వేసినారు. మీరు కోర్టు సమన్లు అందుకున్నప్పటికీ మీరు కోర్టుకు రావడం లేదు. గౌరవ కోర్టు వారు మీ పై నాన్ బెయిల్‌బుల్ వారెంటు జారీ చేసి కోర్టు కమీషనర్‌ని కూడా కేటాయించినారు. పలుమార్లు కోర్టు కమీషనర్ వారు మీ యొద్దకు వచ్చి కోర్టుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తప్పించుకొంటున్నారు. ఈ ప్రకటన ద్వారా కోర్టు వారు ఉత్తర్వుల ప్రకారం ది.12-12-2022కి వాయిదా వేసినారు. **కావున ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

కోర్టు వాయిదా తేదీ : ది.12-12-2022

టి.పృథ్వీరాజు,
అద్వకేట్, కాకినాడ.
సెల్: 96188 72222